సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 10 । సెప్టెంబర్ । 2023



గండిలో భక్తజన సందోహం

గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో శ్రావణ మాసం నాలుగో శనివారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. -IIలో..



లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గీత పేర్కొన్నారు. -IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.8/25.6

జిల్లాలో శనివారం 25.6 – 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

నిజాయితీ భ్రమ.. నిరసన మమ



ప్రొద్దుటూరులోని శివాలయం సెంటర్‌లో నిరసన తెలుపుతున్న టీడీపీ నాయకులు సీఎం సురేష్‌నాయుడు, మాజీ ఎమ్మెల్సీ బచ్చలపుల్లయ్య తదితరులు

చంద్రబాబు తప్పుచేశారని, అందుకే అరెస్టయ్యారని నమ్మడంతో పనిగట్టుకొని ఆందోళనలు చేయాలని అధిష్టానం ఆదేశించినా తెలుగుతమ్ముళ్లల్లో ఆశించిన స్పందన కనిపించలేదు. కొన్నిచోట్ల కొద్దిసేపు టీడీపీ శ్రేణులు రోడ్లపైకి రావడం, బస్సులను నిలిపి వేయడంతో ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో నిరసనలు నీరసంగా కొనసాగాయి.

- చంద్రబాబు అరెస్టును పట్టించుకోని తెలుగుతమ్ముళ్లు
- అధిష్టానం ఆందోళనకు పిలుపునిచ్చినా నామమాత్రపు స్పందన
- తప్పు చేశారు కాబట్టే అరెస్టు అయ్యారంటున్న ప్రజానీకం

సాక్షి ప్రతినిధి, కడప: విజనరీ పేరుతో ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ స్కీమ్‌ను స్కామ్‌గా మార్చుకొని అడ్డంగా దొరికారు. స్పష్టమైన ఆధారాలతో సీఐడీ విభాగం అరెస్టు చేశారు. రూ.371 కోట్లు ప్రజాధనం పక్కదారి పట్టించి దోపిడీ చేశారు. రెండేళ్ల క్రితమే కేసు నమోదు కాగా, అన్ని వేళ్లు చంద్రబాబు వైపే చూపించాయి. వెరసి పక్కా ఆధారాలతో అరెస్టు అయ్యారు. అదే భావనను సీనియర్ రాజకీయవేత్తలు, ప్రజా సంఘాలు సైతం వ్యక్తపరుస్తున్నాయి.

ఉద్రిక్తతలు సృష్టించాలని ఆదేశించినా....

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుతో శనివారం ఉదయాన్నే శ్రేణులకు ఎక్కడికక్కడ ప్రత్యక్ష ఆందోళనలు, ఉద్రిక్తతలు సృష్టించాలని స్పష్టమైన ఆదేశాలందాయి. ఎక్కడ కూడా తెలుగుతమ్ముళ్లు స్వల్ప నిరసన కార్యక్రమాలు మినహా ప్రత్యక్ష ఆందోళనల వైపు దృష్టి పెట్టలేదు. జిల్లా కేంద్రమైన కడపలో పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, కడప ఇన్‌చార్జి మాధవీరెడ్డి ప్రెస్‌మీట్‌కు పరిమితమయ్యారు. సాయంత్రం ఎన్టీఆర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. జమ్మలమడుగులో భూపేష్‌రెడ్డి, ఖాజీపేటలో రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, పోరుమామిళ్లలో రితేష్‌రెడ్డి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన పాటించారు. కమలాపురంలో పుత్తా నరసింహారెడ్డి పోలీసులు తిష్టవేసి ఉన్న ఇర్కాన్ సర్కిల్ ప్రాంతానికి వెళ్లి అరెస్టు అయ్యారు. ఇలా ఎవరికి వారు మమ అన్పించడం మినహా ప్రత్యక్ష ఆందోళనలు చేయలేకపోయారని పలువురు వివరిస్తున్నారు. చంద్రబాబు అరెస్టును రాజకీయంగా అనువుగా మల్చుకోవాలని టీడీపీ భావించినా శ్రేణుల్లో ఆశించిన స్పందన కన్పించలేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

అంతంత మాత్రంగానే బాబుకు మద్దతు

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి మొదలుకొని మిగిలిన చోట్ల ర్యాలీలు, ధర్నాలు చేపట్టాలని టీడీపీ శ్రేణులు సంకల్పించాయి. రాజంపేటలో పార్టీ శ్రేణులు బైపాస్‌లో ర్యాలీగా వెళ్లి రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పీలేరులో మూడు రోడ్ల కూడలిలో టీడీపీ ఆందోళనబాట పట్టడంతో జనాలు విసుక్కుంటూ వెళ్లిపోయారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో టీడీపీ నేతలు ఆందోళనలకు బయటికి రావడంతో ఎక్కడికక్కడ బస్సులు నిలిచిపోయాయి. దీంతో టీడీపీ వైఖరి పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టు చేసిన తర్వాత కూడా ఎక్కడా కూడా స్పందన కనిపించలేదు. ప్రజల నుంచి మద్దతు లభించలేదు.

- తంబళ్లపల్లె లోటీడీపీ శ్రేణులు రోడ్డుపైకి కూడా రాని పరిస్థితి కనిపించింది. అక్కడే కాకుండా రైల్వేకోడూరు, రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేటలలో మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహించారు. చంద్రబాబు వ్యవహారంలో టీడీపీ శ్రేణులు ఆందోళనతో ఇబ్బందులకు గురి చేడయడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చట్టానికి అందరూ సమానమే: జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



రాజంపేట టౌన్: తాను నిప్పును అని పదేపదే చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు స్కిల్‌డెవలప్‌మెంట్ స్కాం కేసులో విచారణకు సహకరించి తన నిజాయితీని నిరూపించుకోవాలి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి హితవు పలికారు. స్థానిక అఫిషియల్ క్లబ్‌లో శనివారం విలేకరులతో ఆకేపాటి మాట్లాడారు. చట్టానికి ప్రతి ఒక్కరు సమానమే అన్న విషయాన్ని బాబు గుర్తు పెట్టుకొని హూందాగా వ్యవహరించాలని సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ. 371 కోట్ల అవినీతి జరిగిందని, ఇందులో చంద్రబాబు అడ్డంగా దొరికి పోయారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర సంవత్సరాలవుతోందని, ఎప్పుడు కూడా తమ ప్రభుత్వం ఎవరిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. అనేక కేసుల్లో అరెస్టలకు భయపడి స్టేలు తెచ్చుకున్న వ్యక్తి చంద్రబాబు అని ఆకేపాటి గుర్తు చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు వడ్డే రమణ, డీ.భాస్కర్‌రాజు, దండు గోపి, జాహీద్ అలీ పాల్గొన్నారు.

స్కాం ఐకాన్ బాబు: ప్రభుత్వ విప్ కొరముట్ల



రైల్వేకోడూరు : స్కాం ఐకాన్‌గా చంద్రబాబు మారిపోయాడని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం రైల్వేకోడూరులో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు విదేశీ ప్రయాణాలకు 100కోట్లు, నవ నిర్మాణ దీక్షలకు 80 కోట్లు ఖర్చు చేశాడన్నారు. ఉద్యోగాల పేరుతో యువతను దగా చేశాడని, వారి పేరుతో రూ.372 కోట్లు దోచేశారని మండిపడ్డారు. చట్టానికి ఎవరూ అతీతం కాదని అన్నారు.

అవినీతి చక్రవర్తి చంద్రబాబు: ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి



కమలాపురం: ప్రపంచంలో అవినీతికి ఆద్యుడు చంద్రబాబు.. అని, ఆయన పెద్ద అవినీతి చక్రవర్తి అని, ఇపుడు పాపం పండిందని, అందుకే అరెస్ట్ చేశారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. శనివారం కడపలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రెండకరాల ఆసామి, చిన్న కొట్టం, హవాయి చెప్పులతో తిరుపతి యూనివర్సిటీలో పీజీ చదివిన చంద్రబాబుకు లక్షల కోట్లు ఎలా వచ్చాయని ఆయన ప్రశ్నించారు. రూ.118కోట్లు కేవలం నీటి బుడగ మాత్రమేనని, ఆయన దోచుకున్నదీ సముద్రం అని అన్నారు. ఈడీ, ఇతర శాఖలు కూడా ఇక తమ పని ప్రారంభిస్తారని, బాబు జైలు కెళ్లడం ఖాయమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో జరిగిన అవినీతి కేసులో చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేసిందన్నారు. ఇప్పటికే 18 కేసుల్లో స్టే తెచ్చుకున్నాడని, ఇక తప్పించుకోలేడన్నారు. చట్టం తన పని తాను చేసుకు పోతుందన్నారు.

చంద్రబాబు ఎన్నో మోసాలు చేశారు: ఎమ్మెల్యే రాచమల్లు



ప్రొద్దుటూరు: చంద్రబాబు ఎన్నో మోసాలు చేశారని, కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి పదవికి అడ్డురాని వయసు జైలుకు వెళ్లడానికి వచ్చిందా అంటూ ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రజాధనానికి కాపలా ఉండాల్సిన ముఖ్యమంత్రిగా ఉండి ధనం స్వాహా చేస్తే జైలులో పెట్టకుండా.. ఉంటారా అని విమర్శించారు దేశంలో చాలామంది ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులపై కేసులు పెట్టారని, కోర్టుకు పోయి శిక్ష పడిన వారు ఉన్నారన్నారు. బోగస్ కంపెనీల ద్వారా విదేశాలకు.. అక్కడి నుంచి చంద్రబాబు నాయుడు ఇంటికి డబ్బు చేరిందన్నారు. ప్రజాధనాన్ని స్వాహా చేసిన వారిపై కేసు పెడితే ధర్నా చేస్తారా అని మండిపడ్డారు. స్కిల్డ్ స్కామ్ కేసులో రింగ్ మాస్టర్ చంద్రబాబు అని తేలిన తర్వాతే సీఐడీ అరెస్టు చేసిందన్నారు.

స్టేలతో నెట్టుకొచ్చారు : కడప మేయర్ సురేష్‌బాబు



కడప కార్పొరేషన్: ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు చేసిన స్కాముల్లో ఇది ఒక భాగం మాత్రమేనని, ఎన్నో కేసులు నమోదు చేసినా స్టేలు తెచ్చుకొని బయట తిరుగుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2014లో 'నేను మారాను.. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాను' అంటే ప్రజలు నమ్మి టీడీపీకి అధికారమిచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు మాసాల్లోనే స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంకు బీజం పడిందన్నారు. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు సీమెన్స్‌తో రూ.3370 కోట్లకు ఒప్పందం చేసుకున్నారన్నారు. పది శాతంగా రూ.370 కోట్లను ప్రభుత్వం చెల్లించినట్లు చూపి కాజేశారన్నారు. 2017లోనే జీఎస్టీ, ఇంటిలిజెన్స్, ఐటీ, సెబీ, ఈడీ సంస్థలు ఇది పెద్ద స్కామ్‌గా తేల్చాయన్నారు. అప్పట్లో ఆ ఫైల్ తొక్కిపెట్టారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక స్కిల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌ను ప్రక్షాళన చేయాలని సంకల్పించారన్నారు. ఈ క్రమంలోనే స్కామ్ బయటపడిందన్నారు. రూ.350 కోట్లను విదేశీ మారక ద్రవ్యంగా మార్చి తమ ఖాతాల్లో వేయించుకున్నారన్నారు. ఈ కేసులో భాగస్వాములైనవారంతా ఇప్పటికే విదేశాలకు పారిపోయారన్నారు. స్టేలు తొలగిపోతే చంద్రబాబు ఎప్పుడైనా జైలుకెళ్లక తప్పదన్నారు. టీడీపీ నాయకులు ధర్నాలు, రాస్తారోకోలు చేయడం సరికాదన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మెన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

తప్పు చేస్తే శిక్ష తప్పదు

- స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అజయ్‌రెడ్డి



ఓబులవారిపల్లె: తప్పుచేస్తే ఎంతటి వారైనా శిక్ష నుంచి తప్పించుకోలేరని.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి అన్నారు. విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ కేబినేట్‌ను తప్పుదారి పట్టించి చంద్రబాబు రూ.371 కోట్లు అప్పనంగా కాజేశారన్నారు. ఆయన తయారుచేసిన అంచనా వ్యయాన్ని డీపీఆర్‌గా చూపిస్తూ స్కిల్ డెవలప్‌మెంట్ నుంచి నోట్ పెట్టించారన్నారు. సెక్రటరియేట్ స్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా పంపి కేబినెట్ ఆమోదించిందంటూ జీవో జారీ చేశారన్నారు. జీవోలో ఒక విధంగా ఒప్పందంలో ఇంకో విధంగా ఎలా ఉంటుందని ఆయన ప్రశ్నించారు. ఆర్థిక శాఖ అధికారులు నిధుల విడుదలపై కొర్రీలు పెడితే.. విడుదల చేయమని చంద్రబాబు ఆదేశించినట్లు ఫైనాన్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తన నోట్ ఫైల్‌లో రాశారన్నారు. పర్యుత్య జీవోకు తమ ఎంఓయూకు ఎలాంటి సంబంధం లేదని సిమెన్స్ సంస్థ అధికారులు మెజిస్ట్రేట్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారన్నారు.

విచారిస్తే రాజకీయ కక్ష అంటారా ?

- రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి: స్కిల్డ్ స్కామ్‌లో తప్పుచేసిన చంద్రబాబునాయుడు పశ్చాత్తాపం పడకుండా సానుభూతి కోసం శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం దుర్మార్గమని రాయచోటి ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయచోటిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నత వ్యవస్థలైన సీబీఐ, న్యాయస్థానాలను ఏ విధంగా ఉపయోగించుకోవాలనే ఆలోచించే చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో దొరికిపోయారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవమంటూ చెప్పుకునే చంద్రబాబు విచారణకు ఎందుకు రావడం లేదన్నారు. రూ.350 కోట్ల సొమ్ము కొల్లగొట్టిన కేసులో వాదించేందుకు ప్రత్యేక విమానాల్లో కోట్లు వెచ్చించి ఆఘమేఘాలపై రాజధాని, ఓటుకు నోటు, వివేకానందరెడ్డి కేసులను వాదిస్తున్న లాయర్‌ను తీసుకురావడం అవసరమా అంటూ ప్రశ్నించారు. విచారిస్తే రాజకీయ కక్ష అంటూ రాష్ట్రంలో అరాచకాలు సృష్టించాలనుకోవడం సిగ్గుచేటన్నారు. తప్పు చేసిన వ్యక్తికి చిత్తశుద్ధి ఉంటే 25 స్టేలను ఎత్తివేయించుకుని, విచారణకు హాజరై నిజాయతీ నిరూపించుకోవాలన్నారు.

ప్రజల సొమ్ము కాజేసినందుకే..

- రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



రాజంపేట: ప్రజల సొమ్ముకాజేసినందుకే మాజీ సీఎం చంద్రబాబునాయుడును సీఐడీ పోలీసులు అరెస్టు చేశారని, ఇందులో ఎటువంటి రాజకీయం లేదని, ఎల్లోమీడియా విషప్రచారం చేసుకుంటోందని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్కిల్‌డెవలప్‌మెంట్‌కు సంబంధించిన రూ.317కోట్ల స్కాంలో తనను అరెస్టు చేస్తారని బాబుకు ముందుగానే తెలుసనన్నారు. నేరం నాదికాదు..నీదన్నట్లుగా నాటక వ్యవహారాన్ని రక్తికట్టించేందుకు ఆడుతున్న నాటకాలు ప్రజలందరికీ తెలుసునన్నారు.బాబు అరెస్టును రాజకయంగా వాకుకోవాలనే దుర్బిద్ధితో ఆందోళన కార్యక్రమాలను చేపట్టారన్నారు. స్కిల్‌స్కాంలో చంద్రబాబును అరెస్టు చేయడం చట్టపరమైన చర్యగా గుర్తించాలన్నారు. నిజనిజాలను న్యాయస్థానమే నిర్ణయిస్తుందన్నారు. బాబు అరెస్టుపై ప్రజల నుంచి ఎటువంటి స్పందన లేదని, టీడీపీ అనుకున్నట్లు సానుభూతి లభించలేదన్నారు. ప్రభుత్వ ధనం ఎవరిరెవరీ ఖాతాల్లోకి అక్రమంగా మళ్లాయో సీఐడీ దర్యాప్తు చేస్తోందన్నారు.

ఎన్టీఆర్ ఆత్మకు శాంతి

- ఎమ్మెల్యే నవాజ్‌బాషా



మదనపల్లె: పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, ఆయన స్థాపించిన టీడీపీని హస్తగతం చేసుకుని, అడ్డదారిలో అధికారంలోకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్ట్‌తో ఎన్టీఆర్ ఆత్మకు శాంతి కలిగిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్ట్‌తో చట్టానికి ఎవరూ అతీతులు కారని, తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని అర్థమవుతోందన్నారు. ఈ ఘటనతో దేశంలో ప్రజాస్వామ్యం బతికి ఉందనే విషయం తేటతెల్లమైందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు తప్పు చేశారు కాబట్టే సీఐడీ అరెస్ట్ చేసిందని, ఇందులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడిందని, రాజకీయ కుట్రగా ఎల్లోమీడియా ప్రచారం చేస్తుండటం దారుణమన్నారు. తాను తప్పుచేశానని, అరెస్ట్ చేస్తారన్న విషయం చంద్రబాబుకు ముందుగానే తెలుసని, నాలుగురోజుల ముందు నుంచే అల్లర్లు జరపాలని, ధర్నాలు, నిరసనలు తెలపాలని టీడీపీ నాయకులకు ఆదేశాలిచ్చారన్నారు. అందులో భాగంగానే నాయకులు రోడ్డు మీదకు వచ్చి హంగామా చేశారే తప్ప వారికి ఏ కోశాన బాబు నిజాయితీపరుడనే నమ్మకం లేదన్నారు.

ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు

- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వాల్మీకిపురం: ఆధారాలతోనే సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్టు చేశారని పీలేరు ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కక్ష సాధింపుతో అరెస్టు చేయలేదని, జీఎస్టీ, నిఘా, ఐటీ, ఈడీ, సెబీ, ఇతర సంస్థలు సుదీర్ఘకాలం విచారించి సాక్షాలు బయట పెట్టిందని తెలిపారు. రాష్ట్రంలోనే స్కిల్డ్ స్కామ్ అతిపెద్ద కుంభకోణమని, మంత్రివర్గాన్ని తప్పుదారిపట్టించి ఆగమేఘాలపై జీవోలు జారీ చేసి అక్రమాలకు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. ఈ కేసులో మాజీ విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, ఆయన కుమారుడినీ అరెస్టు చేశారన్నారు. తనపై ఎలాంటి అవినీతి మరకలేదని పదే పదే గొప్పలు చాటుకునే చంద్రబాబు నాయుడు నిజ స్వరూపం బయటపడిందన్నారు.

పీలేరు: చంద్రబాబునాయుడు ఆది నుంచే అవినీతి చక్రవర్తి అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అనారు. పీలేరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2014 జూన్‌లో చంద్రబాబు అధికారం చేపట్టిన రెండు నెలలకే భారీ దోపిడీకి చంద్రబాబు పూనుకున్నారని తెలిపారు.

ఆధునిక నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ

కలెక్టర్ వి.విజయ్‌రామరాజు

కడప సెవెన్‌రోడ్స్: అర్హులైన 18 రకాల చేతివృత్తిదారులకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇవ్వడంతోపాటు, వారికి ఆధునిక సామగ్రి సరఫరా చేస్తామని కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చేతివృత్తిదారులకు చేయూత అందించేందుకు 'ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ మీటింగ్ అధికారులకు పథకంపై వివరించామన్నారు. ఈ పథకం కింద ఐదు శాతం వడ్డీకే రూ.3 లక్షల మేర బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. వడ్రంగి, పడవల తయారీ, కుమ్మరి, ఆయుధాల తయారీ, సుత్తి, ఇతర సామగ్రి తయారీ, తాళాల మరమ్మతులు, శిల్ప కళాకారులు, స్వర్ణకారులు, కుమ్మర్లు, చెప్పులు కుట్టే వారు, తాపీ పనిచేసేవారు, బుట్టలు, చాపలు, చీపుర్లు, బొమ్మలు తయారు చేసేవారు, కురకులు పూలదండలు అల్లేవారు, బట్టలు ఉతికే రజకులు, బట్టలు కుట్టే దర్జీలు, చేపల వలల తయారీదారులు పీఎం విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వారికి రూ.15 వేల విలువ గల సామగ్రి రాయితీపై అందిస్తారన్నారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 చెల్లించడంతోపాటు ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తారన్నారు. అర్హులైన వారు సమీప గ్రామ, వార్డు సచివాలయాల్లోని కామన్ సర్వీస్ సెంటర్లలో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చనన్నారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, బ్యాంకు పాస్ పుస్తకం, రేషన్ కార్డు డాక్యుమెంట్లను, సమర్పించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అధికారులు, బ్యాంకర్లు ఈ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.

డీఈఓకు ఆర్‌జేడీగా పదోన్నతి



ఆర్‌జేడీగా పదోన్నతి పొందిన రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న రాఘవరెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్య ఆర్‌జేడీగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు శనివారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఆయనకు స్థానాన్ని కేటాయించనున్నారు.

ఒంటరికీ రేషన్‌కార్డు

- నిబంధనల సడలింపు
- అర్హుల గుర్తింపు
- సచివాలయాల్లో సత్వరమే మంజూరు



కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రంలో అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఒంటరి వ్యక్తులకు సైతం రేషన్‌కార్డులను మంజూరు చేయాలని నిర్ణయించిం ప్రక్రియను వేగవంతం చేసింది. గతంలో ఒంటరి వ్యక్తులకు ఈ అవకాశం ఉండేది కాదు. దీంతో అనేక సంక్షేమ పథకాలకు దూరమయ్యేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిబంధనలను సడలించింది. దీంతో ఏళ్ల తరబడి రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న ఒంటరి వ్యక్తుల కల నెరవేరింది.

గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు

రైస్‌కార్డులు లేని ఒంటరి వ్యక్తులు రైస్‌కార్డు కోసం సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని గ్రామ వలంటీర్లు ప్రచారం నిర్వహిస్తున్నారు. అలాగే అర్హులందరి చేత దరఖాస్తులు చేయిస్తున్నారు. వీటిని సంబంధిత వీఆర్వోలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ద్వారా పరిశీలన జరిపి తహసీల్దార్‌కు నివేదిస్తారు. అర్హులకు గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రైస్‌కార్డులను మంజూరు చేస్తారు. ఒంటరి వ్యక్తి రైస్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకుని బయోమెట్రిక్, వేలిముద్రలు వేయాల్సి ఉంటుంది.

అర్హులు వీరే

- భర్తను కోల్పోయి పిల్లలు లేని ఒంటరి మహిళలు
- భార్య మృతి చెంది పిల్లలు లేని ఒంటరి పురుషులు
- 50 ఏళ్ల పైబడి వివాహం కాని పురుషుడు లేదా మహిళ
- కుటుంబ సభ్యులు లేని నిరాశ్రయులైనవారు
- ఒంటరి ట్రాన్స్‌జెండర్లు
- ఇప్పటివరకు ఏ రైస్‌కార్డులో పేరు లేని వారు

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు అర్హులై ఉండి వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి వారి అర్హతలను పరిశీలించి వారికి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. – శివరామిరెడ్డి, తహసీల్దార్, కడప

క్లుప్తంగా

అగ్నిమాపక సిబ్బందికి క్యాష్ అవార్డు



క్యాష్ అవార్డు అందుకున్న అగ్నిమాపక సిబ్బందితో అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల పెన్నానదిలో చిక్కుకున్న నలుగురు యువకులను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది ఎం.వీరారెడ్డి, నూర్ మహమ్మద్‌బాష, హరినాథ్‌గౌడ్, మల్లేష్ నాయక్, సాలర్, రాజశేఖర్, నాగరాజు, ప్రవీణ్‌లకు క్యాష్ అవార్డు అందజేయడం గర్వకారణంగా ఉందని ప్రాంతీయ అగ్నిమాపక అధికారి భూపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం కడపలో జిల్లా అగ్నిమాపకశాఖ కార్యాలయంలో వారికి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, ఇతర ఆపద సమయాల్లో తమ సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను రక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కడప అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి ధర్మారావు, కడప సహాయ అధికారి బసివిరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్న సునీల్ యాదవ్

పులివెందుల : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ–2 నిందితుడిగా ఉండి చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న యాదాటి సునీల్ యాదవ్ తండ్రి యాదాటి కృష్ణయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తండ్రి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు సునీల్‌యాదవ్‌కు ఈ నెల 9, 10, అలాగే ఈ నెల 17, 18 తేదీలలో పెద్దకర్మలో పాల్గొనేందుకు కోర్టు అనుమతించింది. దీంతో శనివారం సునీల్ యాదవ్ తన తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారామలక్ష్మణులను శనివారం రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ హరి హరనాథ్‌శర్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు అర్చకులు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, ఆలయ ప్రదక్షిణ గావించారు. గర్భాలయంలోని మూలవిరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వినాయక చవితికి విగ్రహాలు సిద్ధం

- జిల్లా అంతటా మొదలైన సందడి
- వేల సంఖ్యలో అందుబాటులోకి ప్రతిమలు

కడప నగరంలో ఏర్పాటు కానున్న విగ్రహాలు 300కు పైగా

జిల్లా అంతటా 1500-2000

జిల్లాలో పందిళ్ల ఏర్పాటు, నిర్వహణ వ్యయం రూ. కోటికి పైగా



విక్రయాలకు సిద్ధంగా వినాయక విగ్రహాలు


కడప కల్చరల్ : వినాయక చవితి సందడి మొదలైంది. రెండు నెలల క్రితం నుంచి కడప నగర శివార్లలో గుజరాత్, ఒడిస్సా, రాజస్తాన్ తదితర ప్రాంతాల నుంచి విగ్రహాల తయారీ కార్మికులు పనులు ప్రారంభించారు. రెండేళ్లపాటు వరుసగా భారీ వర్షాలు, అంతకుముందు కరోనా కారణంగా నష్టపోయిన విగ్రహాల తయారీ దారులు ఆ లోటును ఈ సంవత్సరమైనా పూడ్చుకుందామన్న భావనతో భారీ సంఖ్యలో విగ్రహాలను అందుబాటులో ఉంచారు. కడప నగరం చిన్నచౌకులో భారీ సైజుతో తాత్కాలిక షెడ్లు నిర్మించారు. వీటిలో 400 విగ్రహాలను పలు రంగులు, సైజుల్లో సిద్ధం చేశారు. బిల్టప్ వద్ద మరో మూడు షెడ్లలో దాదాపు 300 విగ్రహాలను తయారు చేశారు. నగర శివార్లలో మరికొన్ని చోట్ల కూడా భారీ విగ్రహాలను సిద్ధం చేశారు.

రెట్టింపు అయిన ధర

గణపతి విగ్రహాల ధర ఈ ఏడాది దాదాపు రెట్టింపు స్థాయికి చేరింది. గతంలో ఐదు అడుగుల విగ్రహాలు రూ. 8–10 వేల వరకు విక్రయించేవారు. అదే సైజు విగ్రహాలు ప్రస్తుతం రూ.15 వేలకు చేరాయి. 12, 13 అడుగుల విగ్రహాలు డిజైన్లు, ఇతర దేవతామూర్తుల కాంబినేషన్, రంగులు, హంగులు కలిగి ఉన్న విగ్రహాలు రూ. 30–50 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇవి కాకుండా భారీ విగ్రహాలను నగర వాసులు ప్రొద్దుటూరు, హైదరాబాదు, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి ఒక్కొక్కటి రూ. 2–4 లక్షలు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే సగం విగ్రహాలు రిజర్వు అయ్యాయి. పండుగకు ముందురోజు వీటిని పందిళ్లకు చేర్చేందుకు ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

నిర్వహణ భారం

అన్ని వస్తువుల ధరలు పెరిగిన నేపథ్యంలో ఉత్సవాలను మూడు రోజులపాటు నిర్వహించడం భారంగా మారింది. అయినా ఇప్పటికే చందాలు వసూళ్లు దాదాపు పూర్తి కావడంతో నిర్వాహకుల్లో ముఖ్యంగా యువతలో ఉత్సాహం నెలకొంది. షామియానాలు, ఇతర అలంకారం, మూడు రోజులపాటు పూజా ద్రవ్యాలు, చివరిరోజు అన్నదానం, నిమజ్జనం ఖర్చులు వెరసి ప్రతి పందిరి వద్ద దాదాపు రూ.60 వేల నుంచి రూ. 1.50 లక్షల వరకు ఖర్చు ఉంటుందని అంచనా. ఇప్పటికే కొన్ని చోట్ల పందిళ్ల ఏర్పాటు తుది దశలో ఉండగా, భారీ విగ్రహాలను తెచ్చి సిద్ధంగా ఉంచడం విశేషం. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎక్కువ శాతం విగ్రహాలను మూడవ రోజే నిమజ్జనం చేయనున్నారు. కేవలం 15 శాతం ఐదు రోజులు, ఐదు శాతం విగ్రహాలను తర్వాత నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిమజ్జనానికి అనువుగా ఉండడంతో పండుగ నిర్వహణ పట్ల సర్వత్రా ఉత్సాహం కనిపిస్తోంది.



తండ్రి ఒడిలో బాల గణపతి

అ'పూర్వ' కలయిక



మిత్రులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న సీఎం ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి

రాయచోటి : రాయచోటి ప్రభుత్వ పాఠశాలలో 1978–79లో 10వ తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం రాత్రి విజయవాడలోని ఏపీ టూరిజం పార్కులో గేట్ టు గెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ ఫుడ్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎల్.శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో సీఎం ముఖ్య కార్యదర్శి ధనుంజయరెడ్డి తన తరగతి పూర్వపు మిత్రులతో కలిసి నాటి స్మృతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా 48 మంది విద్యార్థి దశ మిత్రులు కలిసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏ హోదాలో ఉన్నారు, ఎక్కడ పని చేస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సరదాగా ఆడి పాడారు. కార్యక్రమంలో తోటి మిత్రులు అందరూ ధనుంజయరెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం ధనుంజయరెడ్డి మాట్లాడుతూ మీలో ఒకరిగా ఉన్న నన్ను స్థాయిని మించి మాట్లాడి మీ నుంచి దూరం చేయొద్దని కోరారు. తాను ఎక్కడ ఏ హోదాలో ఉన్నా మన ఊరు అభివృద్ధికి సహకరిస్తానని ఆయన తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గీత



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి గీత

కడప కోటిరెడ్డిసర్కిల్ : జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గీత పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎం.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 24 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. కడపలో 6, ప్రొద్దుటూరు 4, రాయచోటి 3, బద్వేలు 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, రాజంపేట, లక్కిరెడ్డిపల్లి, మైదుకూరు, సిద్దవటం, నందలూరు, రైల్వేకోడూరులలో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేశామన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు తమ న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి కేసులను పరిష్కరించుకోవడం జరిగిందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందుకు గాను న్యాయవాదులు, రెవెన్యూ సిబ్బంది, పోలీసు అధికారులు, వైద్యాధికారులు, డిస్టిక్ పబ్లిక్ రిలేషన్, రవాణా, ఇన్సూరెన్స్, బ్యాంకు, చిట్ ఫండ్, కార్మిక, మున్సిపల్, బీఎస్ఎన్ఎల్, ఏపీఎస్పీడీసీఎల్, ఆల్ ఇండియా రేడియో కడప, ఎక్సైజ్, రైల్వే, అగ్రికల్చర్ శాఖల అధికారులతోపాటు ఇతర శాఖల అధికారులు, అడ్వకేట్ క్లర్కులకు కృతజ్ఞలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 9768 కేసులు పరిష్కరించామని, రూ.2,45,62,800 మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించడం జరిగిందన్నారు. ఇందుకు సహకారం అందించిన అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, ఫుల్ అడిషనల్ చార్జి సెక్రటరీ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జిల్లా జడ్జి గీత బాధితురాలికి రూ.60,00,000లను చోళ మండలం జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తరఫున అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రసూన, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ స్రవంతి, బార్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

'శవ రాజకీయాలు చేస్తున్న టీడీపీ'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు నారాయణస్వామి, రసూల్

పులివెందుల రూరల్ : పులివెందుల ప్రాంతంలోని టీడీపీ నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర వాల్మీకి సంఘ డైరెక్టర్ అంబకపల్లె నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ అన్నారు. శనివారం పాత ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో వ్యక్తిగత కారణాల వల్ల జరిగిన హత్యను రాజకీయ హత్యగా చిత్రీకరించడం దుర్మార్గపు చర్య అన్నారు. అంబకపల్లెలో ఒకప్పుడు ఫ్యాక్షన్ గొడవలు ఉంటే.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పుష్కలంగా నీరు అందించి ఏడాదికి మూడు పంటలు పండే విధంగా చేశారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయం, విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించి అంబకపల్లె గ్రామాన్ని అభివృద్ధి చేశారన్నారు. 16 ఏళ్ల నుంచి ఎలాంటి గొడవలు, హత్యలు లేకుండా జీవిస్తున్న గ్రామాల్లో చిచ్చుపెడుతున్నది టీడీపీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. ఆ గ్రామంలో హత్యకు గురైన నాగరాజు రౌడీ షీటరు అని, అతనిపై లింగాల, పులివెందుల మండలాల్లో పలు కేసులు నమోదై ఉన్నాయన్నారు. అలాగే ఒక అమ్మాయికి మాయమాటలు చెప్పి రెండవ వివాహం చేసుకున్న కారణంగా.. ఆమె అన్నదమ్ములు మందలించారని వారిని ఆయన కొడవలితో నరికిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. గతంలో ఇంజినీరింగ్ సీటు ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి అన్యాయం చేసిన విషయం అందరికీ తెలుసన్నారు. పులివెందుల ప్రాంతం ఇంత ప్రశాంతంగా ఉండడానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలతోపాటు వారి కుటుంబ సభ్యులే కారణమన్నారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు శవరాజకీయాలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, సంపత్, రాజేష్, ఈశ్వరయ్య, నాగరాజు, దాసరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆటో నుంచి కింద పడి మహిళ మృతి



మృతి చెందిన జయమ్మ

జమ్మలమడుగు రూరల్ : ఆటోలో ప్రయాణిస్తూ ధనిరెడ్డి జయమ్మ (60) అనే మహిళ కింద పడి మృతి చెందిన సంఘటన జమ్మలమడుగు మండలంలో చోటు చేసుకొంది. పట్టణ ఏఎస్ఐ మురళీ యాదవ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన ధనిరెడ్డి జయమ్మ మైలవరం మండలంలోని కర్మలవారిపల్లె గ్రామంలో ఉన్న తమ అన్న గువ్వల ఈశ్వరరెడ్డి ఇంటికి శనివారం వచ్చింది. గువ్వల ఈశ్వరరెడ్డి కూతురుకు బట్టలు పెట్టి అత్తగారి ఊరైన పెద్దముడియం మండలం గరిశలూరుకు తీసుకెళ్తున్నారు. వారితోపాటు ధనిరెడ్డి జయమ్మ కూడా వెళ్తోంది. వీరందరూ ఆటోలో వెళ్తుండగా మార్గంమధ్యలోని రామిరెడ్డిపల్లె వద్ద ఆటో డ్రైవర్ పక్కన కూర్చొని ప్రయాణిస్తున్న ధనిరెడ్డి జయమ్మ అదుపు తప్పి కింద పడింది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే 108 సాయంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే చనిపోయింది. అన్న గువ్వల ఈశ్వరరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పాము కాటుతో..



గంగులయ్య మృతదేహం

కమలాపురం : మండల పరిధిలోని పొడదుర్తి పంచాయతీ కొత్తపల్లె గ్రామానికి చెందిన గోటూరు గంగులయ్య (47) పాము కాటుకు గురై మృతి చెందాడు. ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గంగులయ్య శుక్రవారం పొలానికి నీరు పారగడుతుండగా పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. శనివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య సునీత ఉంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు



మాట్లాడుతున్న డాక్టర్ వెంకట రాముడు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట రాముడు తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ సందర్భంగా రిమ్స్ ఆడిటోరియంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో ఏటా 1.8 లక్షల నుంచి 2 లక్షల మంది వరకు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ఆత్మహత్యలు జరగకుండా ఉండాలంటే అందుకు సంబంధించిన సమస్యను ముందుగా గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేఖ, డిప్యూటీ సూపరింటెండెంట్ సురేశ్వర్‌రెడ్డి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.


- కడప నగరంలోని ఫాతిమా వైద్య కళాశాల విద్యార్థులు ఐటీఐ సర్కిల్ నుంచి బిల్టప్ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని ఫాతిమా వైద్య కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జవ్వాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలారేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓబులేశు, కో ఆర్డినేటర్ డాక్టర్ రామమనోహర్‌రెడ్డి, ప్రొఫెసర్లు ఫణికుమార్, చంద్రశేఖర్, సుధీర్‌కాంత్, పీజీ, యూజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ప్రేమజంటకు వివాహం

కమలాపురం : మండల పరిధిలోని ప్రేమ జంటకు కౌన్సెలింగ్ నిర్వహించి, ఆ పై వివాహం చేశారు కమలాపురం పోలీసులు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నసంతపురం గ్రామానికి చెందిన కుల్లు ఓబులేసు అదే గ్రామానికి చెందిన పుణ్యవతిలు కొద్ది కాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే ఇటీవల ఓబులేసు తనకు నీ పై ఇష్టం లేదని, తాను వేరే వివాహం చేసుకుంటానని చెప్పడంతో పుణ్యవతి పోలీసులను ఆశ్రయించింది. దీంతో ఎస్ఐ చిన్నపెద్దయ్య స్పందించి ఓబులేసును పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఓబులేసు తన నిర్ణయం మార్చుకుని పుణ్యవతినే వివాహం చేసుకుంటానని చెప్పడంతో పోలీసుల సమక్షంలోనే దండలు మార్చి ప్రేమ వివాహం చేసుకున్నారు. దీంతో పుణ్యవతి ఎస్ఐకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని పోలీసులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి శంకర్, ఏఎస్ఐ రమణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గండిలో భక్తజన సందోహం

- భారీగా తరలివచ్చిన జనం
- ప్రశాంతంగా ముగిసిన శ్రావణ శనివారోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి



భక్తులతో కిక్కిరిసిన ఆలయ ఆవరణం

చక్రాయపేట : పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో భక్తజన సందోహం నెలకొంది. శ్రావణ మాసం నాలుగవ శనివారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకొని పరవశించి పోయారు. రద్దీ దృష్టిలో ఉంచుకొని పోలీసులు అద్దాలమర్రి క్రాస్, ఇడుపులపాయ క్రాస్‌ల వద్దనే వాహనాలను నిలిపివేశారు. దీంతో భక్తులు కాలినడకన గండికి చేరుకుని దర్శించుకున్నారు. కొందరు వేంపల్లె, చక్రాయపేట, నాగలగుట్టపల్లె, వేముల తదితర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దాతలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్రప్రసాద్, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆర్కేవ్యాలీ సీఐ గోవిందరెడ్డి, చక్రాయపేట ఆర్కేవ్యాలీ ఎస్సైలు వినోద్‌కుమార్, రంగారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చక్రాయపేట ప్రభుత్వ వైద్యాధికారి వాణి నేతృత్వంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కడప సర్వజన ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబి రం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. స్వామిని ఆలయ ప్రధాన, ఉప ప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, రఘుస్వామి, వేదపారాయణం రామ మోహనశర్మలు ప్రత్యేకంగా అలంకరించా రు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అయితే కొందరు జేబుదొంగలు తమ చేతి వాటం ప్రదర్శించా రు. పబ్బాపురానికి చెందిన శోభన అనే మహిళకు చెందిన రెండు తులాల బంగారు నగలను దోచుకెళ్లారు. ఈ విషయాన్ని ఆమె పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

అంజన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రావణమాసం చివరి శనివారం నాడు ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, కడప ఆర్డీవో ధర్మచంద్రారెడ్డిలు గండి అంజన్నను దర్శించుకొన్నారు. వారిచే అర్చకులు ప్రత్యేక పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం వారికి ఆలయం తరఫున స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

వైభవంగా క్షేత్రోత్సవం

వీరాంజనేయస్వామి వారి క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, భక్తుల కోలాటం మధ్య ఉత్సాహంగా సాగింది. అంబూరు నుంచి తెప్పించిన పూలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలోని ఉష్ట్ర(ఒంటె) వాహనంపై స్వామి ఉత్సవ విగ్రహాన్ని అధిష్టింపజేసి క్షేత్రోత్సవం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల మధ్యన ఆస్థానం నిర్వహించి ఉత్సవాలను ముగించారు. దీంతో శ్రావణ మాస శనివారోత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి.

సాక్షి
ఫ్యామిలీ
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం ॥ 10-9-2023

వైరల్




గ్రీన్ సిగ్నల్

పట్టణాల్లోని చిన్న అపార్ట్‌మెంట్‌వాసుల నోటి నుంచి తరచుగా వినిపించే మాట 'మొక్కలు అంటే మాకు చాలా ఇష్టం. కాని స్థలం ఎక్కడిది?'

'స్థలం పెద్దగా అక్కర్లేదు. పెంచాలనే సంకల్పం ఉంటే చాలు' అంటుంది బిహార్‌కు చెందిన కమల్‌సింగ్.

ఉద్యోగ నిమిత్తం బెంగళూరులో ఉంటున్న కమల్‌సింగ్ తన చిన్న అపార్ట్‌మెంట్ బాల్కనీలో రకరకాల మొక్కలు పెంచుతుంది.

'వంటగది వ్యర్థాలతో కంపోస్ట్‌ను ఎలా తయారు చేయాలి?' అనే విషయం నుంచి ఏ మొక్కలను ఎలా పెంచాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి వరకు... ఎన్నో విషయాలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తోంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ 'అర్బన్ హోమ్ వైబ్స్'కు ఎంతోమంది ఫాలోవర్స్ ఉన్నారు.

'స్టార్ట్ వేర్ యూ ఆర్ విత్ వాటెవర్ యూ హ్యావ్' అంటున్న కమల్‌సింగ్ స్ఫూర్తితో ఎంతో మంది పట్టణ వాసులు తమ బాల్కనీలో మొక్కల పెంపకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి 'మేము సైతం' అంటున్నారు.



మలాలాతో మహ్నూర్

బహుముఖ ప్రజ్ఞాశాలి

పదహారు సంవత్సరాల బ్రిటీష్-పాకిస్థానీ మహ్నూర్ ఛీమ లండన్‌లోని జనరల్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (జీసీఎస్ఈ) లెవెల్‌లో 34 సబ్జెక్‌లలో టాప్ గ్రేడ్ సాధించి రికార్డ్ సృష్టించింది. గణిత శాస్త్రం, ఖగోళశాస్త్రంలాంటి శాస్త్రాలు, ఫ్రెంచ్, లాటిన్... మొదలైన భాషలలో అద్భుతమైన ప్రతిభ చూపుతుంది మహ్నూర్. ఆమె ఎంచుకున్న 34 సబ్జెక్ట్‌లలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, లిటరేచర్, ఫిల్మ్ స్టూడియోస్, సైకాలజీ... మొదలైన సబ్జెక్ట్‌లు ఉన్నాయి.

'ఇది మహ్నూర్‌కు మాత్రమే పరిమితమైన విజయం కాదు. ఈతరంలో ఎంతోమందికి స్ఫూర్తినిచ్చే విజయం' అని ట్వీట్ చేశారు పాక్ మాజీ ప్రధాని షెహబాజ్ షరీఫ్.

'వైద్యురాలిగా పదిమందికి సేవ చేయాలి' అనేది తన జీవిత ఆశయంగా చెబుతుంది మహ్నూర్.

ఇదిగో సారూ... నా మేక టికెటు



గ్రామీణ ప్రాంతాల్లో పెంపుడు జంతువులను కుటుంబసభ్యులుగా చూసుకుంటారు. పేర్లు పెట్టి ప్రేమగా పిలుచుకుంటారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక మహిళ మేకను పెంచుకుంటుంది. ఒకరోజు ఆమె వేరే ఊరికి పోవాల్సి వచ్చింది. మేకను ఇంట్లో ఒంటరిగా విడిచిపెట్టడం ఇష్టం లేక తనతో పాటు తీసుకెళ్లింది. విశేషం ఏమిటంటే మేకకు కూడా ట్రైన్ టికెట్ తీసుకుంది. ఐఏఎస్ అధికారి అవినాష్ శరణ్ ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ వైరల్ అయింది.

'తన మేకకు కూడా టికెట్ తీసుకున్న విషయాన్ని టీటీయితో ఎంత గర్వంగా చెబుతుందో చూడండి' అని రాశారు అవినాష్.

ఇక వీడియో క్లిప్ విషయానికి వస్తే... టికెట్ చూపించమని ఆమెను టీటీయి అడుగుతాడు. 'ఇదిగో' అంటూ చూపిస్తుంది.

'నీ సంగతి సరే, మరి మేకకు టికెట్ తీసుకున్నావా?' అని సరదాగా అడుగుతాడు టీటీయి.

'అమ్మో...తీసుకోకుండా ఎలా ఉంటాను. ఇదిగో టిక్కెట్టు' అని చూపిస్తుంది.

'నేను తరచుగా రైల్లో ప్రయాణిస్తుంటాను. టికెట్ లేకుండా ట్రైన్‌లో ప్రయాణించి టీటీయికి దొరికి పోయేవారిని చాలామందిని చూస్తుంటాను. వారిని గుర్తు తెచ్చుకున్నప్పుడు ఈమె చాలా గొప్పగా అనిపిస్తుంది' అని ఒక యూజర్ స్పందించాడు.

కాలం కలిసి వస్తే డంప్‌యార్డ్ కూడా నందనవనం అవుతుంది!



కాలం కలిసే వస్తే... కంపు కొట్టే డంపు యార్డ్ కూడా కనుల విందు చేసే పార్క్ అవుతుంది. రాజస్థాన్‌లోని రాజ్‌గఢ్‌లో ఒక డంప్ యార్డ్ ఉండేది. దుర్వాసన వల్ల ఆ చుట్టుపక్కల నుంచి నడిచి వెళ్లాలంటే జనాలు జడుసుకునేవారు. అలాంటి చోటుకు ఇప్పుడు జనాలు వెదుక్కుంటు వస్తున్నారు. దీనికి కారణం ఈ డంప్‌యార్డ్‌ను మున్సిపాలిటీ సిబ్బంది అందమైన పార్క్‌గా తయారుచేయడమే.

వాటర్ ఫౌంటెన్‌లు, పచ్చటి గడ్డితో ఈ పార్క్ కనువిందు చేస్తోంది.

ఇండియన్ ఫారెస్ట్ ఆఫీసర్ సవిత దావియా ఈ క్లిప్‌ను ట్విట్టర్‌లో షేర్ చేశారు.

'ఎన్నో పట్టణాలలో ఎన్నో డంప్‌యార్డ్‌లు భయపెడుతున్నాయి. అవి కూడా ఇలాగే నందనవనంలా మారితే ఎంత బాగుంటుంది' అంటూ ఒక ఎక్స్ యూజర్ స్పందించాడు.

కథక్ నుంచి తీన్మార్ వరకు

బెల్జియన్ కంటెంట్ క్రియేటర్ ఈడీ పీపుల్ వివిధ ప్రాంతాలలో లోకల్స్‌తో కలిసి చేసే డ్యాన్స్ వీడియోలు ప్రపంచ వ్యాప్తంగా ఫేమ్ అయ్యాయి. ఏదైనా ప్రాంతానికి వెళ్లిన పీపుల్ స్థానికులను 'మీకు ఇష్టమైన డ్యాన్స్ ఏమిటి?' అని అడగడమే కాదు 'నాకు నేర్పించగలరా?' అని రిక్వెస్ట్ చేసి ఓపిగ్గా నేర్చుకుంటాడు.

అలా ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లను నేర్చుకుంటూ, స్థానికులతో పోటీ పడి డ్యాన్స్ చేస్తుంటాడు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

తాజాగా మన దేశానికి సంబంధించి వివిధ ప్రాంతాలకు చెందిన డ్యాన్స్‌లు చేసి 'వారేవా' అనిపించుకున్నాడు.

'మీ డ్యాన్స్ చూస్తుంటే భారతీయ పౌరసత్వం ఇవ్వాలనిపిస్తుంది'

'మా దేశంలోని కొన్ని అద్భుతమై డ్యాన్స్‌లను మిస్ అయ్యారు. వాటిని కూడా చేస్తే బాగుంటుంది' అంటూ వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఈడీ పీపుల్ షేర్ చేసిన డ్యాన్స్ వీడియోలపై నెటిజనులు స్పందించారు.





అటు చూస్తే జవాన్ ఇటు చూస్తే ఆఫీస్...

అటు చూస్తే బాదం హల్వా ఇటు చూస్తే సేమ్యా ఇడ్లీ... అని శ్రీశ్రీ అన్నట్టుగా ఆ బెంగుళూరు ఐ.టి ఉద్యోగికి కూడా సంకటం వచ్చింది. ఒకవైపు జవాన్ రిలీజ్. మరోవైపు సాఫ్ట్‌వేర్ డ్యూటీ. చివరకు అతను రెండూ చేశాడు. వైరల్ అయ్యాడు.

బెంగళూరులోనే ఇటువంటివి జరుగుతుంటాయి. మొన్నా మధ్య ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ర్యాపిడో బైక్ వెనుక కూచుని ఆఫీస్‌కు వెళుతూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోతే బైక్ మీదే ల్యాప్‌టాప్ తెరిచి లాగిన్ అయ్యి డ్యూటీ మొదలెట్టేశాడు. భారీ ట్రాఫిక్ వల్ల క్యాబుల్లో ఎక్కగానే ల్యాప్‌టాప్‌లు తెరిచే వాళ్లూ అక్కడ ఎక్కువే. ఇప్పుడు ఒక ఉద్యోగి ఏకంగా సినిమా హాల్లోనే ల్యాప్‌టాప్ తెరిచాడు. ఏం చేస్తాడు మరి? షారూక్ ఖాన్ ఫ్యాన్. ఫస్ట్ డే ఫస్ట్ షో. సరిగ్గా ఆ టైమ్‌కే లాగిన్ అవ్వాలి. అందుకని థియేటర్‌లో ల్యాప్‌టాప్‌లో వేళ్లు టిక్కుటక్కుమంటుంటే కళ్లు సినిమాకు అంకితం అయ్యాయి. వెనుక కూచున్న ఒక వ్యక్తి ఇది ఫొటో తీసి ఇన్‌స్టాలో పెడితే లక్షల కొద్దీ వ్యూస్ వచ్చాయి. 'బెంగళూరులో ఇక పని చేయకుండా వదిలేసిన చోటు ఏదీ లేదు' అని కామెంట్లు చేస్తూ ఏడవలేక నవ్వుతున్నారు.



హెల్త్



చాలారకాల వైరల్ జ్వరాల్లాగే డెంగీ కూడా తనంతట తానే తగ్గిపోయే (సెల్ఫ్ లిమిటింగ్) వ్యాధి. అయితే కొంత మందిలో మాత్రం ప్లేట్‌లెట్లు ప్రమాద స్థాయి కంటే కిందికి పడిపోతాయి. అది మినహా చాలావరకు డెంగీ నుంచి దాదాపుగా అందరూ కోలుకుంటారు. పైగా ఇది వైరల్ జ్వరం కావడంతో కేవలం లక్షణాలకు మాత్రమే చికిత్స చేస్తూ... ప్లేట్‌లెట్ కౌంట్‌ను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. ఇటీవల పెద్దసంఖ్యలో ఈ కేసులు వస్తున్న నేపథ్యంలో డెంగీపై అవగాహన కోసం ఈ కథనం.

డెంగీ నివారణ ఇలా...!



డెంగీలో రకాలు

డెంగీ రకాలను ఈ కింది విధంగా పేర్కొనవచ్చు. అవి... ఏ హెచ్చరికలూ లేకుండా వచ్చే డెంగీ **(డెంగీ విదవుట్ వార్నింగ్ సైన్స్)** ; కొన్ని హెచ్చరికలతో వచ్చే డెంగీ **(డెంగీ విత్ వార్నింగ్ సైన్స్)** ; తీవ్రమైన డెంగీ **(సివియర్ డెంగీ)**

లక్షణాలు

హెచ్చరికలు లేకుండా అకస్మాత్తుగా వచ్చే డెంగీ : డెంగీ ఎండెమిక్ ప్రాంతాల్లో... అంటే డెంగీ ఎక్కువగా వస్తున్న ప్రాంతంలో ఇది కనిపిస్తుంటుంది. వీళ్లలో జ్వరం, వికారం/వాంతులు, ఒళ్లు నొప్పులు, ఒంటి మీద ర్యాష్ వంటి లక్షణాలు కనిపిస్తాయి.

కొన్ని హెచ్చరికలతో కనిపించే డెంగీ : పైన చెప్పిన లక్షణాలతో పాటు పొట్ట నొప్పి, ఊపిరితిత్తుల చుట్టూ ఉండే ప్లూరా అనే పొరలో లేదా పొట్టలో నీరు చేరడం. కొందరిలో పొట్ట లోపలి పొరల్లో రక్తస్రావం అవుతుండటం, బాధితులు అస్థిమితంగా ఉండటం, రక్తపరీక్ష చేయించినప్పుడు ఎర్ర రక్త కణాలకూ, మొత్తం రక్తం పరిమాణానికి ఉన్న నిష్పత్తి కౌంట్ పెరగడంతో పాటు ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోతుంది.

తీవ్రమైన డెంగీ (సివియర్ డెంగీ) కేసుల్లో : అంతర్గత అవయవాల్లో రక్తస్రావం కారణంగా బాధితుడు తీవ్రమైన షాక్‌కు గురవుతాడు. ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాసప్రక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. తీవ్ర రక్తస్రావంతో బాధితుడు స్పృహకోల్పోవచ్చు లేదా పాక్షిక స్పృహలో ఉండవచ్చు. మల్టిపుల్ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తో కీలకమైన అవయవాలు పనిచేయకుండా పోవచ్చు.

నిర్ధారణ పరీక్షలు :

● సీబీపీ ప్రతి 24 గంటలకు ఒకసారి చేయాలి. ● నిర్ధారణ కోసం డెంగీ ఎన్ఎస్1 యాంటీజెన్ పరీక్ష అవసరం కావచ్చు.

● డెంగీ ఐజీఎమ్ అనే పరీక్ష కూడా చేయాలి. కొన్ని అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ రిపోర్టులు వచ్చేందుకు పట్టే సమయం కూడా ఎక్కువే కాబట్టి డాక్టర్లు అవి వచ్చే వరకు ఆగకుండా... లక్షణాలను బట్టి చికిత్స అందించడం ప్రారంభిస్తారు.

● పై పరీక్షలతో పాటు ఇప్పుడు ఐపీఎఫ్ (ఇమ్మెచ్యూర్ ప్లేట్‌లెట్ ఫ్రాక్షన్) అనే అత్యాధునిక పరీక్ష అందుబాటులో ఉంది. ఇది ప్లేట్‌లెట్లను ఎప్పుడు, ఎంత పరిమాణంలో ఎక్కించాలో తెలుసుకోవడంతో పాటు మరెన్నో అంశాలు తెలుసుకోడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

నివారణ ఇలా...

అన్ని వ్యాధుల్లోలాగే డెంగీలోనూ చికిత్స కంటే నివారణ ఎంతో మేలు. డెంగీని కలిగించే టైగర్ దోమ పగటిపూటే కుడుతుంది. దీని సంతానోత్పత్తి మంచి నీటిలోనే. ఈ ప్రక్రియకు పదిరోజుల వ్యవధి పడుతుంది. కాబట్టి వారంలోని ఏదో ఒక రోజు ఇంటిలోని నీటిని పూర్తిగా ఖాళీ చేసి డ్రై డే గా పాటిస్తే, దీని జీవితచక్రానికి విఘాతం కలిగి ప్రత్యుత్పత్తికి అంతరాయం ఏర్పడుతుంది.

● ఇళ్ల మూలలూ, చీకటి, చల్లటి ప్రదేశాలే టైగర్ దోమల ఆవాసం. ఇల్లంతా వెలుతురు, సూర్యరశ్మి ధారాళంగా వచ్చేలా చూసుకోవడంతో పాటు, దోమలు రాకుండా తలుపులకు, కిటికీలకు మెష్ అమర్చుకుంటే...ఒక్క డెంగీ దోమలే కాకుండా...మలేరియా, ఇతర వ్యాధులకు గురి చేసే దోమల్నీ నివారించినట్లు అవుతుంది.

● టైగర్ దోమ పెద్దగా ఎత్తుకు ఎగరలేదు. అందువల్ల కాళ్లు పూర్తిగా కప్పి ఉంచే దుస్తులతో, ఫుల్‌స్లీవ్‌తో చాలావరకు రక్షణ కలుగుతుంది. ● నిల్వ నీటిలోనే దోమ గుడ్లు పెడ్తుంది కాబట్టి కొబ్బరి చిప్పలు, డ్రమ్ములు, బ్యారెల్స్, టైర్లు, కూలర్లు, పూలకుండీల కింద పెట్టే ప్లేట్లు మొదలైన వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. అలాగే వాడని డ్రమ్ముల్ని బోర్లించి ఉంచాలి.

● దోమలను తరిమివేసేందుకు మస్కిటో రిపలెంట్స్ వాడవచ్చు.

డెంగీ వస్తే ఆందోళన చెందాల్సిన అవసరం ఉండదు. కొందరిలో మినహాయించి అది అందరిలోనూ ప్రమాదకరం కాదు. కాకపోతే గర్భిణులు, చిన్నారులు, పెద్దవయసు వారికి డెంగీ సోకినప్పుడు అది తగ్గేవరకు జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది.

చికిత్స...

డెంగీ అన్నది వైరస్ కారణంగా వచ్చేది కాబట్టి దీనికి నిర్దిష్టంగా మందులేమీ ఉండవు. అందువల్ల లక్షణాలకు మాత్రమే చికిత్స (సింప్టమాటిక్ ట్రీట్‌మెంట్) ఇస్తారు. అంటే... అవసరమైనప్పుడు రక్తనాళం ద్వారా ఐవీ ఫ్లూయిడ్స్ ఎక్కించడం, అవసరాన్ని బట్టి రక్తాన్ని, ప్లేట్‌లెట్స్‌ను, ప్లాస్మా ఎఫ్ఎఫ్‌పి (ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా) ఇవ్వాల్సి ఉంటుంది. ఒకవేళ ప్లేట్‌లెట్స్ కౌంట్ 20 వేల నుంచి 15 వేలు లేదా అంతకంటే తక్కువకు పడిపోతేనే ప్లేట్‌లెట్స్ ఎక్కించాలి.

టీకా ఉందిగానీ...

ప్రస్తుతం డెంగీకి టీకా (వ్యాక్సిన్) అందుబాటులో ఉన్నప్పటికీ ఇది అందరూ తీసుకునే పరిస్థితి ప్రస్తుతానికి లేదు. గతంలో ఓసారి డెంగీకి గురైన వారికి మాత్రమే టీకా ఇవ్వాలి. ఎందుకంటే రెండోసారి వచ్చే డెంగీ రావడం రావడమే చాలా ప్రమాదకరంగా ఉండి ప్రాణాపాయమూ కల్పించవచ్చు. కాబట్టి ఆ పరిస్థితిని నివారించేందుకు ఒకసారి డెంగీ వచ్చినవారికి మాత్రమే టీకా ఇస్తారు.

డెంగీలో మరింత ప్రమాదకరమైన కొన్ని లక్షణాలివి...

● ప్లేట్ లెట్స్ తక్కువ కావడంతో అంతర్గత అవయవాలలోకి రక్తస్రావం అయ్యే ప్రమాదంతో పాటు ఒంట్లోకి నీరు చేరడం, సివియర్ డీహైడ్రేషన్‌కు గురికావడం జరగవచ్చు. ● కొందరిలో హీమోగ్లోబిన్ కాన్సంట్రేషన్ పెరుగుతుంది. హెమటోక్రిట్ పెరుగుతుంది. దీనివల్ల రక్తం గడ్డకట్టదు. రక్తపోటు పడిపోతుంది. లివర్ ఎన్‌లార్జ్ అయి, అది దెబ్బతినే ప్రమాదముంటుంది. గుండెస్పందనలు నిమిషానికి 60 కంటే తక్కువకు కూడా పడిపోవచ్చు. ఇలా గుండె స్పందనలు తగ్గినప్పుడు బాధితుల్ని ఇంటెన్సివ్ కేర్‌లో ఉంచాల్సి వస్తుంది. బ్లీడింగ్, ఫిట్స్ వల్ల మెదడు దెబ్బతినే ప్రమాదమూ ఏర్పడవచ్చు. వ్యాధినిరోధక వ్యవస్థ (ఇమ్యూన్ సిస్టమ్) పూర్తిగా దెబ్బతినడానికి అవకాశముంది.



డా॥ రవీంద్ర కుమార్
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్

పిన్‌వార్మ్ / థ్రెడ్ వార్మ్ ఇన్ఫెక్షన్ అంటే...?



కొందరు చిన్నారుల్లోని ప్రైవేట్ ప్రాంతాల్లో సన్నటి దారాల్లాంటి క్రిములు కనిపిస్తుంటాయి. మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు కనిపించే ఇవి నిజానికి మల ద్వారం నుంచి వస్తుంటాయి. అవయవ నిర్మాణపరంగా (అనటామికల్‌గా) మూత్ర విసర్జన ప్రాంతం (యురెథ్రా)... మల ద్వారానికి దగ్గరగా ఉండటంవల్ల ఇవి మూత్ర ద్వారం నుంచి వస్తున్నట్లు అనిపిస్తుంటాయి. సన్నటి దారాల్లాంటి ఆకృతిని బట్టి వాటిని థ్రెడ్‌వార్మ్స్ లేదా పిన్‌వార్మ్స్ అంటారు. ఈ ఇన్ఫెక్షన్‌ను 'ఎంటిరోబియాసిస్' అని కూడా చెబుతారు.

యుక్తవయసుకు వచ్చిన (అడల్ట్) పిన్ వార్మ్స్ పెద్ద పేగుల్లో నివాసముంటాయి. ప్రతి అడల్ట్ జీవి 10,000 గుడ్లు పెడుతుంది. రాత్రివేళల్లో ఆడ పిన్‌వార్మ్ పెద్దపేగు (కోలన్) నుంచి మలద్వారం (రెక్టమ్) ద్వారా బయటకు వచ్చి పిరుదుల ప్రాంతంలో గుడ్లను వదిలేస్తుంది. ఆ గుడ్లు పిరుదుల మీద, మలద్వారం పరిసరాల్ని అంటిపెట్టుకుని ఉంటాయి. కొన్ని గుడ్లు గాల్లోకి కూడా వ్యాపిస్తాయి. వాటి నుంచి బయటకు వచ్చిన లార్వాలు బయటకు పిరుదులు, మలద్వారం, మూత్రద్వారం దగ్గర తచ్చాడుతుంటాయి. దురద కారణంగా పిల్లలు అక్కడ గీరుకున్నప్పుడు అవి గోళ్లలోకి చేరుతాయి. అవే చేతుల్ని నోట్లో పెట్టుకున్నప్పుడు అవి కడుపులోంచి మళ్లీ పెద్ద పేగుల్లోకి చేరి... ఇలా జీవిత చక్రాన్ని కొనసాగిస్తుంటాయి. వాటి లైఫ్ సైకిల్ పూర్తి కావడానికి 4-6 వారాలు పడుతుంది.

వ్యాప్తి ఇలా...

పిల్లలు ఆడుకునే బొమ్మలు, బెడ్ షీట్స్, తువాళ్లూ, లోదుస్తులు, టాయిలెట్ సీట్స్ ద్వారా తేలిగ్గా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. మరీ చిన్నపిల్లల్లో వాడిన డయపర్స్‌ను పెద్దలు ముట్టుకున్న తర్వాత వేరే పిల్లలను పట్టుకున్నప్పుడు కూడా వ్యాప్తి చెందే అవకాశాలుంటాయి. అయితే ఈ పిన్‌వార్మ్ ఇన్ఫెక్షన్ పెంపుడు జంతువుల (పెట్స్) ద్వారా ఇతరులకు వ్యాపించదు.

నివారణ చర్యలివి...

● పిల్లలకు ప్రతిరోజూ రెండుపూటలా స్నానం చేయించాలి. ● పిల్లలు తరచూ చేతులు శుభ్రంగా కడుక్కునేలా తల్లిదండ్రులు అలవాటు చేయాలి. ముఖ్యంగా మలవిసర్జన తర్వాతా, మట్టిలో ఆడిన తర్వాత పిల్లలు శుభ్రంగా చేతులు కడుక్కునేలా చూడాలి. ● పిల్లల గోళ్లు ఎక్కువగా పెరగకుండా వాటిని ఎప్పటికప్పుడు కత్తిరిస్తుండాలి. ● పిల్లలు తమ గోళ్లు కొరక్కుండా చూడాలి. గోళ్లు కొరికే అలవాటు ఉంటే మాన్పించాలి. ● ఇంట్లో ఎవరికైనా పిన్‌వార్మ్ ఇన్ఫెస్టేషన్ ఉంటే వాళ్లతో పాటు మిగతావాళ్లూ చికిత్స తీసుకోవాలి. లేకపోతే ఇది తరచూ తిరగబెడుతుండే అవకాశాలు ఎక్కువ.

చికిత్స... మెబెండజోల్, ఆల్బెండజోల్, పెరెంటల్ పామోయేట్ అనే మందుల్ని తగిన కోర్సులుగా ఇవ్వడం ద్వారా దీన్ని పూర్తిగా నయం చేయవచ్చు.

పిల్లల్లో పొరబోయిందా? గొంతులో ఏదైనా ఇరుక్కుందా?

పిల్లలు తినే సమయంలో వారి గొంతులో ఏదైనా ఇరుక్కున్నపుడు పొర పోయిందని పెద్దలు అంటుంటారు. తిన్న ఆహారం కిందికి కదలడం కోసం తలపై తడుతుంటారు. కానీ గొంతులో ఇరుక్కున్న ఆహారంగానీ లేదా నాణెంలాంటి వస్తువుగానీ ఊపిరితిత్తుల్లోకి వెళ్లే వాయునాళంలోకి పోతే చాలా ప్రమాదం. ఇలా ఆహారం ఇరుక్కున్నా లేదా ఏదైనా వస్తువు గొంతులో ఇరుక్కున్నా హాస్పిటల్‌కు వెళ్లేలోపు ఈ కింద పేర్కొన్న సూచనలు పాటించాలి.

● పిల్లల నోరు బాగా తెరిపించి, నాలుక బాగా చాపేలా చేసి, గొంతులోకి వేళ్లుపోనిచ్చి చేతికి ఏదైనా తగులుతుందేమో చూడాలి. తగిలితే వెంటనే బయటకు తీసేయాలి. ● పిల్లాడి వెనక పెద్దలెవరైనా నిల్చుని, వారి రెండు చేతుల్నీ పొట్టచుట్టూ బిగించి, అకస్మాత్తుగా చేతుల్తో పట్టుబిగుస్తున్నట్లుగా కదిలించాలి. ఇది క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేస్తుండాలి. దాంతో పొట్ట దగ్గర ఒత్తిడి పెరిగి, గొంతులో ఇరుక్కున్నది బయటకు రావచ్చు. దీన్ని హీమ్‌లిచ్ మెనోవర్ అంటారు.



● ఇదే గనక చాలా చిన్నపిల్లల్లో / పసిపాపల్లో చేయాల్సి వస్తే... పెద్దలు కుర్చీలో కూర్చుని, చిన్నారులు తలకిందులుగా ఉండేలా, వాళ్లను తమ కాళ్లపైన బోర్లా పడుకోబెట్టాలి. ఇలా పడుకోబెట్టాక, చిన్నారుల వీపుపై అకస్మాత్తుగా ఒత్తిడి కలిగేలా నొక్కాలి. ఇది ఎలా జరగాలంటే... చిన్నారుల నడుము నుంచి వారి రెండు భుజాల మధ్య ప్రాంతంలో మృదువుగా ఒత్తిడి కలిగేలా కదిలిస్తుండాలి. ఇది కూడా క్రమపద్ధతిలో (రిథమాటిక్‌గా) చేయాలి. ఒకవైపు పొట్ట మీద పెద్దల కాళ్ల ఒత్తిడీ, మరోవైపు వీపు మీద చేతుల ఒత్తిడి కారణంగా గొంతులో అడ్డు పడ్డ పదార్థం బయటకు వచ్చే అవకాశం ఉంది. ● ప్రథమ చికిత్సగా ఇవి చేస్తూ... వీలైనంత త్వరగా పిల్లల్ని హాస్పిటల్‌కు తరలించాలి. ఈ ప్రక్రియలతో గొంతులో ఇరుక్కున్నవి బయటకు వస్తే సరి. లేదంటే హాస్పిటల్‌లో అవసరాన్ని బట్టి ఎండోస్కోప్ వాడి, ఇరుక్కున్న పదార్థాన్ని డాక్టర్లు బయటకు తీస్తారు.